క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమావేశం

గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే ? అనే విషయంపై నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చుట్టుగుంట నుంచి చిలకలూరిపేటకు వెళ్లే దారిలో మిర్చి యార్డు సమీపంలోగల హోటల్ అట్లాస్‌లో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు తదితరులు పాల్గొంటారని ఆమె తెలియజేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులంతా పాల్గొనాలని ఆమె కోరారు.

నేడు నంబూరులో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

పెదకాకాని: మండలంలోని నంబూరు ఎంపీపీ స్కూలులో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు తెలిపారు. ప్రత్యేక వైద్యనిపుణుల పర్యవేక్షణలో జరిగే ఈ వైద్య శిబిరాన్ని గ్రామ ప్రజలు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీతో పాటు కంటి పరీక్షలు కూడా చేస్తారని ఆయన పేర్కొన్నారు.

శేషేంద్ర శర్మ సాహితీ సృజన విశ్వజనీనం



కవి శేషేంద్ర శర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: కవిగా, విమర్శకుడిగా, నవలాకారుడిగా తెలుగు సాహిత్యానికి గుంటూరు శేషేంద్ర శర్మ పరచిన దారి విశ్వజనీనమైనదని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం శేషేంద్ర శర్మ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివరామిరెడ్డి మాట్లాడుతూ ప్రముఖ కవిగా, విమర్శకుడిగా, బహుభాషా కోవిదుడుగా, గొప్ప కవితా వారసత్వానికి శేషేంద్ర శర్మ గట్టి పునాదులు వేశారని తెలిపారు. ఆధునిక, సంప్రదాయ రీతుల్లో సరిసమానంగా అనేక రమైన మధురమైన కవితల్ని అందించారని గుర్తు చేశారు. ఆయన రచనల్లో ప్రధానంగా ప్రకృతి, సామాన్య ప్రజల స్థితిగతులు కళ్లకు కట్టినట్లు కన్పించేవని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సాహితీ రంగ విశ్లేషకులు బిళ్లా అశోక్, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగమంటే పవిత్రమైన బాధ్యత



నియామక పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ ఉద్యోగమంటే ఉపాధి మాత్రమే కాదని, అదొక పవిత్రమైన బాధ్యతని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో శుక్రవారం జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, డెప్యూటీ కలెక్టర్ స్వాతితో కలసి 93 మందికి కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్టీసీలో పనిచేస్తూ మరణించిన వారికి ఇంత స్థాయిలో ఎన్నడూ నియామక పత్రాలు అందజేయలేదని తెలిపారు. తల్లిదండ్రులు ఎంతో నిబద్ధతతో పని చేసిన ఉద్యోగంలో చేరుతున్న అభ్యర్థులు దాన్ని గుర్తుంచుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ఉన్నామనే భావన ఉండాలని చెప్పారు. జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలు పొందేందుకు లక్షల మంది నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. కారుణ్య నియామకం ద్వారా ఎంపికైన వారు తల్లిదండ్రుల శ్రమను గుర్తుంచుకోవాలని ఆమె పేర్కొన్నారు. ప్రజలతోనూ, సహచర సిబ్బందితోనూ స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. పనిలో సందేహాల్ని సీనియర్లను అడిగి తెలుసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు, జెడ్పీ సీఈవో జె.మోహన్‌రావు, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, డ్వామా పీడీ యుగంధర్ కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

శ్రీ కన్యకా పరమేశ్వరికి 58 కేజీల లడ్డూ సమర్పణ

పాత గుంటూరు: శరన్నవరాత్రుల సందర్భంగా ఆర్. అగ్రహారంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి బైసాని కిరణ్ అధ్వర్యంలో శుక్రవారం 58 కేజీల లడ్డూను సమర్పించారు. గత 19 సంవత్సరాలుగా నవరాత్రుల్లో తమ సంస్థ తరపున ప్రసాదాలను అందజేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.



పెదకాకాని శివాలయంలో శ్రీ సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు



చిన్నపలకలూరులో ఏర్పాటు చేసిన నవరాత్రి ఉత్సవ ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్



చినపలకలూరు పోలేరమ్మ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, దయాసాగర్ దంపతులు



పెదకాకాని శివాలయంలో అమ్మవారికి సారె సమర్పించేందుకు వస్తున్న ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులు



జొన్నలగడ్డలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు తదితరులు



చేబ్రోలు నాగేశ్వరస్వామి దేవస్థానంలో ..

సరస్వతీ నమస్తుభ్యం !

పెదకాకాని శివాలయంతో పాటు పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న శరన్నవరాత్రుల ఉత్సవాలలో ఆరో రోజు అమ్మవారు శ్రీ సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దలు, విద్యార్థులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. చినపలకలూరు పోలేరమ్మ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పాల్గొన్నారు.

– పెదకాకాని/గుంటూరు రూరల్/చేబ్రోలు

రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి పెద్దపీట

- నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు
- వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రజల ఆరోగ్య సంరక్షణకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తున్నారని గుంటూరు నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు పేర్కొన్నారు. 12వ డివిజన్ చౌత్ర సెంటర్‌లోని గవర్నమెంట్ గరల్స్ హైస్కూలులో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును అధికారులతో కలసి మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు.



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మేయర్

ఇంటి వద్దకే సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ప్రతి ఒక్కరికీ అందేలా ఆరోగ్య సురక్ష క్యాంప్‌లను ఏర్పాటు చేశారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి హెల్త్ సెంటర్ వద్ద సురక్ష క్యాంప్‌లు జరుగుతున్నాయని, రాష్ట్ర చరిత్రలో ఎవ్వరూ ఊహించని విధంగా వీటిల్లో ఉత్తమ వైద్య సేవలు అందించేందుకు స్పెషలిస్ట్ డాక్టర్లను అందుబాటులో ఉంచారని వివరించారు. క్యాంప్‌ల్లో వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందిస్తున్నారన్నారని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ వైద్య రంగం బలోపేతానికి ప్రభుత్వం ప్రణాళికాబద్ధమైన కృషి చేస్తోందని తెలిపారు. క్యాంప్‌ల్లో ఖరీదైన కంటి పరీక్షలు, ఈసీజీ, థైరాయిడ్ పరీక్షలు పూర్తి ఉచితంగా చేసి మందులు ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఖాజా మొహిద్దీన్ చిష్టి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, మెడికల్ ఆఫీసర్స్, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్టాల్ గరల్స్ హాస్టళ్లకు రక్షణ కల్పించాలి

నెహ్రూనగర్: నగరంపాలెంలోని స్టాల్ గరల్స్ హైస్కూలు కాంపౌండ్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్సీ, బీసీ హాస్టల్స్ విద్యార్థినులకు రక్షణ కల్పించాలని గరల్స్ హైస్కూలు విద్యార్థినులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ సుకన్యా రాణి మాట్లాడుతూ బొల్లెద్దు కిరణ్ అతని అనుచర వర్గం స్కూల్ కాంపౌండ్‌లో అక్రమంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. దీనిపై కోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు. కాంపౌండ్‌లో వ్యాపారాలు నిర్వహించరాదని తీర్పు ఇవ్వడంతో చుట్టూ గోడ నిర్మించినట్లు పేర్కొన్నారు. అయితే, 19వ తేదీ రాత్రి కొంత మంది వ్యక్తులు గోడను కూల్చివేశారని, దీనిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఎన్నికల విధుల్లో పారదర్శకత పాటించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల ప్రత్యేకాధికారి హరిహరనాథ్

చేబ్రోలు: ఎన్నికల విధుల్ని సిబ్బంది అంతా ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని పొన్నూరు నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి హరిహరనాథ్ ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం బీఎల్‌వోల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిహరనాథ్ ఎన్నికల విధులు, నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఇంటింటి సర్వేలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ గురించి ఆరా తీశారు. ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రతి క్లెయిమ్‌కు సంబంధించి పూర్తి వివరాలు ఉండాలన్నారు.కార్యక్రమంలో తహసీల్దారు కె.వి.గోపాలకృష్ణ, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

బాలలంతా ఉన్నతంగా ఎదగాలి



పోలీసుస్టేషన్‌ను సందర్శించిన చిన్నారులు

పెదకాకాని: బాలబాలికలు బాగా చదువుకొని సమాజంలో ఉత్తమ వ్యక్తులుగా ఎదగాలని పెదకాకాని ఎస్ఐ వెంకటాద్రి సూచించారు. మంగళగిరి గుడ్‌షెపర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ఇన్‌చార్జి సిస్టర్ లత ఆధ్వర్యంలో శనివారం వెనిగండ్ల, పెదకాకాని గ్రామాలకు చెందిన చిల్డ్రన్స్ పార్లమెంటరీ లీడర్స్‌ను పెదకాకాని పోలీసుస్టేషన్, జిల్లా కోర్టు ఎక్స్‌పోజర్ విజిట్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటాద్రి పోలీసుస్టేషన్‌లో కేసులు, ఎఫ్ఐఆర్ నమోదు, రికార్డులు చూపించి అవగాహన కలిగించారు. చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు జడ్జి రామకృష్ణ బాలల హక్కులు, కోర్టుల్లో తీర్పులు, పోక్సో యాక్ట్ వంటి అంశాలపై చిన్నారులకు వివరించారు. పోలీసుస్టేషన్, న్యాయస్థానాల సందర్శనతో చిన్నారులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది ఎస్. నాగమణి, డి. అనిల్, జె. ఇజ్రాయెల్, బి. విజయలక్ష్మి పాల్గొన్నారు.

పేదల పాలిట వరం జగనన్న ఆరోగ్య సురక్ష



పెదకాకానిలో అంగన్‌వాడీ స్టాల్



నారాకోడూరు దళితవాడలో వైద్య పరీక్షలు



కుర్నూతలలో మందుల పంపిణీ

పొన్నూరు: రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల పాలిట వరంగా మారిందని మునిపల్లె గ్రామ సర్పంచ్ కూచిపూడి స్వరూప రాణి అన్నారు. మండలంలోని మునిపల్లె ఎంపీయూపీ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఉచిత వైద్య శిబిరంలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ ఆరోగ్య సమస్యలపై వచ్చిన వారికి స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్వరూప రాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష శిబిరాలలో ప్రైవేట్ ఆసుపత్రుల కంటే మెరుగైన వైద్యం లభిస్తోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ శిబిరంలో 423 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వారందరికీ మందులు ఉచితంగా అందించడంతోపాటు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యశాలలో చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు వేల్పూరి వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ రూరల్ అధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషులు, బీసీ నాయకులు దాసరి శివరామకృష్ణ , వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భద్రతే లక్ష్యం

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భద్రత కల్పించి, ఆరోగ్యంగా జీవించాలనే ఆకాంక్షతో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు వట్టిచెరుకూరు తహసీల్దారు నాసరయ్య తెలిపారు. మండలంలోని కుర్నూతలలో శుక్రవారం గ్రామ సర్పంచ్ యర్రాకుల గోపాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మెగా మెడికల్ క్యాంప్‌ను సద్వినియోగించుకోవాలని ఆయన సూచించారు. శిబిరంలో 360 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు సర్పంచ్ గోపాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మన్నవ వీరనారాయణ, సర్పంచ్ సుబ్బారెడ్డి, మైనారిటీ సెల్ మండల కన్వీనర్ సయ్యద్‌నూరుల్లా, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ బుర్రి ప్రకాష్, కంచర్ల సింగారావు, వై. నాగేశ్వరరావు, కె. మోహనరావు, యాకోబు, గ్రామ సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం

పెదకాకాని: ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి సేవలను అందిస్తున్నారని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెదకాకానిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీడీవో ఎ. రామకృష్ణ,, ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, గ్రామ సర్పంచి గోళ్ల స్వరూపరాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. శిబిరంలో 502 మందికి వైద్యసేవలు అందించారు. 28 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఏర్పాట్లను పెదకాకాని పీహెచ్‌సీ సూపర్‌వైజర్ పి. శ్రీనివాసరావు పర్యవేక్షించారు. శిబిరంలో డాక్టర్ సీహెచ్. విజయప్రకాష్, డాక్టర్ ఎస్.రామాంజిరెడ్డి, డాక్టర్ భవిష్య, డాక్టర్ అనూష వైద్యసేవలు అందించారు. ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో డాక్టర్ సౌజన్య, డాక్టర్ వసుచంద్రిక సేవలు అందించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పోషకాహార పదార్థాల స్టాల్ విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో సూపరింటెండెంట్ బి.వి. మల్లేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు షేక్ షహనాజ్, పంచాయితీ కార్యదర్శి రాజారాం, స్థానిక నాయకులు సయ్యద్ సుభాని, గోళ్ల జోసఫ్, శ్యాంముఖర్జీబాబు, ఆలపాటి రాఘవ, కృష్ణారెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నారాకోడూరులో 460మందికి వైద్య పరీక్షలు

చేబ్రోలు: మండలంలోని నారాకోడూరు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. దళితవాడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. స్పెషలిస్ట్ వైద్యులు 460మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని తహసీల్దారు కె.వి.గోపాలకృష్ణ, ఎంపీడీవో బి. బాబూరావు, వైద్యాధికారి అబ్రహం లింకన్, డీసీఎంఎస్ డైరక్టర్ కుర్రా పాములు పర్యవేక్షించారు.

పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు



వెనిగండ్లలో తనిఖీ చేస్తున్న ఏవో సంధ్యారాణి

పెదకాకాని: అధీకృత డీలర్ల నుంచే పురుగు మందులు కొనుగోలు చేసి రైతులకు బిల్లుల ద్వారా అమ్మకాలు జరపాలని మండల వ్యవసాయ అధికారి పి. సంధ్యారాణి ఆదేశించారు. మండలంలోని పెదకాకాని, వెనిగండ్ల గ్రామాల్లోని పురుగు మందుల షాపుల్లో శనివారం తనిఖీ చేశారు. పురుగు మందుల లైసెన్స్‌లు, కొనుగోలు బిల్లులు, ప్రిన్సిపుల్ సర్టిఫికెట్లు, రైతులకు ఇచ్చే అమ్మకపు బిల్లులు, స్టాక్ బోర్డులు పరిశీలించారు. వ్యాపారులకు పలు సూచనలు చేశారు. వెనిగండ్లలోని శ్రీమహాలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ షాపులో ప్రిన్సిపుల్ సర్టిఫికెట్ లేని 7.51 లీటర్ల పురుగు మందు అమ్మకాలను నిలిపివేశారు. నిబంధనలకు విరుద్ధంగా పురుగు మందుల వ్యాపారం చేసే వారిపై 1968 యాక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

వరిలో పొడ తెగులుపై అప్రమత్తత అవసరం



రైతులకు సూచనలు చేస్తున్న ఏవో కిరణ్మయి

కాకుమాను: వరి పంటపై ఆశించే పొడ తెగులుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో కె.కిరణ్మయి సూచించారు. కాకుమానులో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వరి పంటపై అక్కడక్కడా పొడ, అగ్గి తెగులు కనిపిస్తోందని చెప్పారు. పొడ తెగులు సోకిన మొక్కపై మచ్చలు నిర్దిష్ట ఆకారం లేకుండా మధ్యలో బూడిద రంగు అంచులు ఏర్పడతాయని ఆమె వివరించారు. తెగులు సోకితే దిగుబడులు తగ్గే అవకాశాలు అధికంగా ఉంటాయని ఆమె సూచించారు. నివారణకు ఎకరాకు హెక్సాకొనజోల్ 2 గ్రాముల మందును నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలని ఆమె సూచించారు. అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 6 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ



పట్నంబజారు: అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతోందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ రీజినల్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ గుంటూరు, కృష్ణాజిల్లాల కో– ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్‌తో కలసి మంత్రి తుళ్లూరు మండలం వెలగపూడి గ్రామానికి చెందిన దానసిరి శంకరరావుకు రూ. 1.20 లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అని, అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

పుస్తక పఠనం లేక యువత నిర్వీర్యం

ఒంగోలు నుంచి విజయవాడకు 'మరో గ్రంథాలయ ఉద్యమం' పాదయాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయోద్యమంలో సమాజాన్ని, దేశాన్ని చైతన్య పర్చిన గ్రంథాలయోద్యమం ప్రస్తుతం పర్యవేక్షణ, ఆదరణ లేక సమాజం చైతన్యరహితంగా తయారవుతోందని ప్రముఖ కథా రచయిత మంచికంటి వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మరో గ్రంథాలయ ఉద్యమం ఒంగోలు నుంచి విజయవాడకు పాదయాత్రగా బయలుదేరి శుక్రవారం గుంటూరుకు చేరిన సందర్భంగా జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న ఏపీటీఎఫ్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంచికంటి మాట్లాడుతూ యువత, విద్యార్థులు సరైన పుస్తక పఠనం లేక సెల్‌ఫోన్ మోజులో నిర్వీర్యం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న చిన్న విషయాలకు భావోద్వేగాలు అదుపులో ఉంచుకోక పెడదారిన పడుతున్నారని తెలిపారు. ఈ సమయంలో ప్రతి పాఠశాల, కళాశాల, ఊరు, వాడల్లో గ్రంథాలయాలు స్థాపించి యువతను పుస్తక పఠనం వైపు మళ్లించాలని ఆయన పేర్కొన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ రచయిత మంచికంటి పాదయాత్ర అభినందనీయమని తెలిపారు. రచయిత్రి రుక్మిణి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రోజుకు ఒక పీరియడ్ తప్పక గ్రంథాలయంలో పఠనం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

జీజీహెచ్‌లో సత్యసాయి సమాచార సహాయ కేంద్రం



సమాచార సహాయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో శ్రీ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సత్య సాయి ఉచిత సమాచార సహాయ కేంద్రాన్ని శుక్రవారం సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులకు సేవ చేసేందుకు సత్య సాయి సేవా సమితి ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. సత్య సాయి సమితి సభ్యులకు నర్సింగ్ సిబ్బంది సహకారాలు అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ ఏ.రామకృష్ణ రావు, కె.సాయిబాబు, డాక్టర్ పి.ఎల్.నరసింహమూర్తి, వై.రోశరావు, శ్రీధర్, ఎన్.వి.హనుమంత రావు, శిరీష, అపర్ణ, సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశా సజని పాల్గొన్నారు.